ఆర్‌బికె ఉద్యోగుల సంతాపం

నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు:బాపట్ల జిల్లా చావలి ఆర్‌బికే ఇంచార్జి, వ్యవసాయ సహాయకురాలు బెల్లంకొండా పూజిత వ్యవసాయ అధికారుల తీవ్రమైన ఒత్తిడితో బలవన్మరణం చేసుకోవడం బాధాకరమని అల్లూరి సీతారామారాజు జిల్లా పాడేరు ఆర్‌బికే ఉద్యోగులు తెలిపారు. మేరకు మండల కేంద్రంలోని ఆర్‌బికె వద్ద సంతాపం తెలిపారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారుల వేధింపులతో ఆమె బల్వాన్ మరణానికి పాల్పడడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఉద్యానవన సహాయకులు జిల్లా అధ్యక్షులు శెట్టి. రాజు, జనరల్ సెక్రటరీ కూడా గణపతిరాజు, అల్లూరి జిల్లా మహిళా అధ్యక్షురాలు కూడా రజిత, వైస్ ప్రెసిడెంట్ దాశరధి, అనిల్ కుమార్, రవి కుమార్ పాలొగొన్నారు.

పూర్తిగా ఛిద్రంగా ఉన్న బస్కీ రహదారి

రాళ్లు తేలిన రహదారి

బస్కీ రోడ్డును బాగు చేయరూ..

మండలంలోని అరకువేలి నుండి బస్కీ వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోలేదని వాహనదారులు వాపోయారు.

ప్రజాశక్తి-అరకులోయరూరల్:

-రాళ్లు తేలిన రహదారి
-ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
-పట్టించుకోని అధికారులు

అరకువేలి నుండి బస్కీ వెళ్లే రహదారి మార్గం గుండా అరకువేలి మండలం బస్కి, మాడగడ, సుంకరమెట్ట పంచాయతీ, హుకుంపేట మండలం బూర్జ, పట్టం, గతుం, అనంతగిరి మండలం పైనంపాడు, వేంగడ పంచాయతీలకు చెందిన గిరిజనులు అరకువేలి మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురి కావడంతో గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారి పొడవునా గుంతల మయంగా అధ్వానంగానూ, ఎత్తుపల్లాలుగా ఉండటంతో వాహనదారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు.

గుంతలతో పలు మార్లు పమాదాలు

ఈ రోడ్డు మరమ్మతుఎ గురి కావడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. మాడగడ యు పాయింట్ పాల సముద్రం వీక్షించడానికి వెళుతున్న పర్యాటకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో వర్షపు నీటితో నిండిన గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మాడగడ యూ పాయింట్ సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న వాగులోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి.

గతంలో రోడ్డు మార్గం గుండా బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం రోడ్డు మరమ్మతుకు గురి కావడంతో ప్రస్తుతం బస్సు సౌకర్యం లేదు. దీంతో, ఈ ప్రాంత గిరిజన వాసులు ఆయా గ్రామాలకు రాక పోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు గిరిజనులు కాలినడకన, వాహనాలపైనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇబ్బంది పడుతున్నారు.

రోడ్డు బాగోలేక ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే, అధికారులు స్పందించకపోవడం దారుణమని స్థానికులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి అరకువేలి నుంచి బస్కి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రాణాలు కాపాడాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతు చేయకుంటే పోరాటం

బస్కి రోడ్డు మరమ్మతుకు గురి కావడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్డు మరమ్మతు చేపట్టాలని గతంలో అనేక పోరాటాలు చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణం. ఎన్నిసార్లు చెప్పినా స్పందించక పోవడం బాధాకరం. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో రోడ్డు బాగున్నప్పుడు బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం రోడ్డు మరమ్మతుకు గురి కావడంతో ఇప్పుడు బస్సు సౌకర్యం లేదు. దీంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. అధికారులు స్పందించకుంటే గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తాం.

పొద్దు బాలదేవ్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన
టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో . 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ మోడల్ పరీక్షను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ జీవన్ కష్ణ వెల్లడించారు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ అన్ని జిల్లాల్లో టెన్త్ విద్యార్థులకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తోందని చెప్పారు. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఏజెన్సీ 11 మండలాల్లో కూడా 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఈనెల 4 నుండి టాలెంట్ టెస్ట్ రిజిస్ట్రేషన్‌కు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కేవలం 30 రూపాయలు మాత్రమే చెల్లించి నమోదు చేసుకోవాలని కోరారు. టాలెంట్ టెస్ట్ మోడల్ పరీక్షకు విద్యార్థులు హాజరు పరిచేందుకు గిరిజన సంఘం, జన విజ్ఞాన వేదిక అల్లూరి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీలు కృషి చేస్తున్నాయని తెలిపారు. టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థినీ విద్యార్థులు కూడా తమ ప్రతిభను, సృజనాత్మక పెంపొందించుకోవడానికి, భయాన్ని పోగొట్టుకోవడానికి దోహదపడుతుందన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు భయం లేకుండా రాయడానికి మార్గంగా దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చిన్నారావు, మత్యరాజు, సింహాద్రి, సంగీత, జెస్సి పాల్గొన్నారు.

అరకులోయలో పారిశుధ్య పనులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

పారిశుధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ అధికారి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండల కేంద్రంలో గిరిజన మ్యూజియం పక్కన నిర్మించిన ఐటిడిఏ షాపింగ్ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలం బహిరంగ మలవిసర్జన, చెత్తచెదారాలతో నిండి ఉండటంతో దుర్గంధభరితం పేరుతో ప్రజాశక్తిలో ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. దదుర్వాసనతో పర్యాటకులు, దుకాణదారులు ఇబ్బంది పడుతుండంపై ఆ కథనంలో పేర్కొనడంతో ఆదివారం పంచాయతి అధికారి పి.రాజ్ కుమార్ దగ్గరుండి పారిశుధ్య కార్మికులతో చెత్తాచెదరాన్ని తొలగించారు. పరిశుభ్రం చేసి బ్లీచింగ్‌తో శానిటేషన్ చేశారు.

అంగన్వాడీల సమ్మె విజయం
భవిష్యత్ పోరాటాలకు స్ఫూర్తి

విజయోత్సవ సభలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామారావు, సిఐటియు నాయకులు వెంకట్

విఆర్.పురంలో కేక్ కట్ చేస్తున్న అంగన్వాడీలు

విజయోత్సవ సభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్.

ప్రజాశక్తి -విఆర్.పురం: పోరాటాలతో ఏదైనా సాధ్యమని అంగన్వాడీల సమ్మె విజయమే నిదర్శనమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు. సిఐటియు జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ అన్నారు. అంగన్వాడీల సమ్మె విజయం, భవిష్యత్ పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని కొనియాడారు. ఆదివారం రేఖపల్లి ఎఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కమిటీ అధ్యక్షురాల టి.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ సభలో మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్ని వేధింపులు, ఒత్తిళ్లకు గురిచేసినా మొక్కవోని దీక్షలో 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేపట్టి అంగన్వాడీలు తమ హక్కులను సాధించుకున్నారని, వారి పోరాటం అభినందనీయమన్నారు. ఎస్మా ప్రయోగం, అరెస్టులు, నిర్బంధాలకు గురిచేసినా, అంగన్వాడీలు వెనక్కు తగ్గకపోవడంతో చివరకు రాష్ట్ర ప్రభుత్వమే దిగొచ్చి, పది హామీలను నెరవేర్చిందన్నారు. అంగన్వాడీల విజయోత్సవ వేడుకల్లో భాగంగా కేకు కట్ చేశారు. లయబద్ధంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు సున్నం రంగమ్మ, కునవారం మండలానికి చెందిన సిఐటియు జిల్లా సభ్యులు కొమరం పెంటయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పులి సంతోష్‌కుమార్, యుటిఎఫ్ నాయకులు సోడి నాగేశ్వరరావు, డివి.సత్యనారాయణ, అంగన్వాడీ జిల్లా యూనియన్ మండల కార్యదర్శి రాజేశ్వరి, పలువురు అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు, సిపిఎం నాయకులు ప్రకాశరావు, సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లోతా రామారావు

రంపచోడవరం : అంగన్వాడీల వీరోచిత పోరాటం స్ఫూర్తిదాయకమని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు, అంగన్వాడీల 42 రోజుల సమ్మె సఫలమైన నేపథ్యంలో ఆదివారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి నిర్మల అధ్యక్షతన రంపచోడవరంలో విజయోత్సవ సభ నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పల్లపు వెంకట్ మాట్లాడుతూ, ప్రాణాలను ఫణంగా పెట్టి, కనీవినని రీతిలో అంగన్వాడీలు చేసిన ఉద్యమం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అయిందన్నారు.

ఐక్యంగా పోరాడితే విజయం తథ్యమని, దేనైన్నా సాధించుకోవచ్చని అంగన్వాడీలు నిరూపించారన్నారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి నిర్మల, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వాణిశ్రీ మాట్లాడుతూ, ఇ అంగన్వాడీలకు ఉద్యమ అభినందనలు తెలిపారు, అంగన్వాడీల సమ్మెకు మద్దతు ఇచ్చిన ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు, యుటిఎఫ్, ఇతర ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు, లబ్ధిదారులకు ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ, సమ్మెతో అంగన్వాడీలు సత్తా చాటారని కొనియాడారు. విజయోత్సవంలో భాగంగా అంగన్వాడీలు నృత్యాలు చేశారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా నాయకురాలు కె రామలక్ష్మి, కె రాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, కె శాంతి రాజు, నాయకులు చిన్ని కుమారి, కె వెంకటలక్ష్మి, సింగారమ్మ, రత్నకుమారి, నాగదేవి, సిహెచ్ లక్ష్మి, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రికి చెందిన రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. డాక్టర్ 'దాసరి ఉమా మహేష్, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ పాల్గొని రోగులు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60మందికి రక్తపరీక్షలు, 11మందికి థైరాయిడ్ పరీక్షలు, 19మందికి ఎక్స్‌రేలు, 13.మందికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజీ తెలిపారు.

అలాగే వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించి 53మందికి కంటి పరీక్షలు చేశారు. దృష్టిలోపం ఉన్న 13మందికి ఉచిత కళ్లద్దాలును అందించారు. కంటి ఆపరేషన్‌కు 11మందిని ఎంపిక చేసి తరలించారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటి బాబు, సిబ్బంది పాల్గొన్నారు, రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

సమస్యల పరిష్కారం, హామీల అమలుకు
8న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా

ఎస్ఇ ప్రశాంత్ కుమార్‌కు వినతి ఇస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు, సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 8న ఎపి జెన్‌కో ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి విద్యుత్తు ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) కెకెవి.ప్రశాంత్‌కుమార్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీలేరు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్ విష్ణుకుమార్ మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తానన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని కోరారు. 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాల చెల్లింపు, కాంట్రాక్ట్ కార్మికుల బకాయిల విడుదల, ఎపి జెన్‌కోలో పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ కార్మికులను అన్ స్కిల్డ్ నుంచి సెమీ స్కిల్డ్ గా తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు పీస్ రేటు విధానాన్ని రద్దు చేసి, కనీస వేతనం అమలు చేయాలని, తెలంగాణ తరహాలో డైరెక్ట్ పేమెంట్ చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా జెన్‌కో ఎస్ఇ ప్రశాంత్‌కుమార్‌కు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు డైరీని అందజేశారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రికల్ యూనియన్ సిటీ రీజనల్ ప్రెసిడెంట్ బివి. రమణ పాల్గొన్నారు.

టాటా టెక్నాలజీలో ఉద్యోగాలకు
6న చింతపల్లిలో ఇంటర్వ్యూలు

గిరిజన యువ మహిళలకు అవకాశం

గిరిజన యువ మహిళలకు వివరిస్తున్న కొయ్యూరు ఎస్ఐ

ప్రజాశక్తి -సీలేరు: టాటా టెక్నాలజీ సంస్థలో గిరిజన యువ మహిళలు ఉద్యోగాలకు ఈనెల 6న చింతపల్లి వైటిసిలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని జికె.వీధి సిఐ అశోక్‌కుమార్ తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్‌పి తుఫాన్ సిన్హా ఆదేశాల మేరకు ఎఎస్‌పి కొమ్ము ప్రతాప్ శివకిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంపికలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.
ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, టాటా టెక్నాలజీ సంస్థ, ఐఫోన్ తయారీ కంపెనీలో ఉద్యోగాలకు 18.-30 ఏళ్ల వయస్సు కలిగి, కనీసం ఇంటర్మీడియేట్ విద్యార్హత కలిగిన గిరిజన యువ మహిళలు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థినులకు కర్ణాటకలోని హోసూర్ సిటీలో శిక్షణనిచ్చి, ఉద్యోగావకాశాలను కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.20వేలు ప్రారంభ వేతనంతో ఉద్యోగావకాశాలను కల్పిస్తారన్నారు. శిక్షణ సమయంలో భోజన సౌకర్యాలను కల్పిస్తారన్నారు. ఆడపిల్లలను బెంగళూరు అంత దూరం పంపించాలంటూ తల్లిదండ్రులు భయపడాల్సిన పనిలేదని, వారికి పోలీసుశాఖ పరంగా పూర్తి రక్షణ ఉంటుందన్నారు, ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి పోలీసుల సహకారంతోనే బెంగళూరు తీసుకెళ్లి శిక్షణలో జాయిన్ చేయిస్తామన్నారు. దీనిపై అన్ని గ్రామాల్లోని గిరిజన యువ మహిళలకు సమాచారం అందేలా చర్యలు చేపట్టాలని స్థానికులను కోరారు. నెట్‌వర్క్ అందుబాటులోలేని గ్రామాల్లోని నిరుద్యోగ యువ మహిళలకు కూడా సమాచారం అందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిఐ అశోక్‌కుమార్ సూచించారు.
కొయ్యూరు : అల్లూరి జిల్లా పోలీసు వారి ఆధ్వర్యంలో ఈనెల 6న ప్రేరణ కార్యక్రమంలో భాగంగా టాటా టెక్నాలజీస్ సంస్థలో 3 వేలకు పైబడి ఉద్యోగాల భర్తీకి చింతపల్లి వైటిసిలో ఇంటర్వ్యూలు నిర్వహించననున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ గిరిజనమహిళా అభ్యర్థులు స్థానిక మహిళా పోలీసులను లేదా కొయ్యూరు పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు హోసూరులో ఉచిత భోజన, వసతితో శిక్షణనిచ్చి, రూ.20వేల నెలసరి వేతనంతో ఉద్యోగాల్లో నియమిస్తారన్నారు.

వికలాంగుని వైద్యానికి రాజేశ్వరి సాయం

గాయపడిన వికలాంగుడిని చైతన్యరథంలో ఎక్కిస్తున్న ఎమ్మెల్యే అనుచరులు

ప్రజాశక్తి- మారేడుమిల్లి : రంపచోడవరం టిడిపి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మానవత్వం చాటుకున్నారు. మార్గమధ్యలో త్రీవీలర్ బైక్ ప్రమాదానికి గురై, గాయాలతో రోడ్డుపై స్పృహ కోల్పోయి, నిస్సహాయ స్థితిలో ఉన్న ఎస్.సిద్ధు అనే వికలాంగుడిని తన చైతన్యరథంలో ఆసుపత్రికి తరలించి వైద్యసాయంఅందించే చర్యలు చేపట్టారు. వివరాలివి.

చింతూరులో టిడిపి కార్యకర్తల ఇంటిగ్రేటెడ్ శిక్షణలో పాల్గొనేందుకు తన చైతన్యరథంలో వెళుతున్న రంపచోడవరం టిడిపి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి, మారేడుమిల్లి, చింతూరు ఘాట్‌రోడ్డులో వాలమూరు గ్రామసమీపాన మార్గమధ్యలో ప్రమాదకరమైన మలుపు వద్ద, త్రీవీలర్ బైక్ అదుపు తప్పి చింతూరు గ్రామానికి చెందిన వికలాంగుడు గాయాలతో స్పృహ కోల్పోయి రోడ్డుపైనే నిస్సహాయ స్థితిలో ఉండడాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, గాయపడిన వికలాంగునికి అవసరమైన సపర్యలు చేయించి, తర్వాత చైతన్య రథం వాహనంలో మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఆపదలో ఉన్న వ్యక్తికి, అందులోనూ వికలాంగునికి అవసరమైన సాయం చేసి, మంచి మనసు చాటుకున్న మాజీ ఎమ్మెల్యే వంతల చర్యలపై పలువురు హర్ష వ్యక్తం చేశారు

ఉప ముఖ్యమంత్రి బూడిని కలిసిన నాయకులు

రోడ్డు నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్: మండలంలో మారుమూల పంచాయతీ పినకోట, పెద్దకోట గ్రామాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడుని కోరినట్లు పినకోట సర్పంచ్ ఎస్ గణేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, తమ గ్రామాలకు వెళ్లాలంటే రోడ్లు పూర్తిగా మరమ్మతుకు గురయ్యాయన్నారు. ఐదు పంచాయతీ గ్రామాలకు ఒకటే దారి కావడంతో మరమ్మతు గురైన రహదారిలో ప్రయాణించాలంటే కష్టతరం అవుతుందని ఆయన అన్నారు. పినకోట, పెద్దకోట పంచాయతీలకు చెందిన గ్రామాలకు తట్టపూడి పెదబురుగ మీదుగా పినకోటకు ప్రధాన రహదారి సౌకర్యం కల్పించాలని కోరామన్నారు. సుమారు 12 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారి నిర్మిస్తే సుమారు ఐదు పంచాయతీల గ్రామాల గ్రామాల గిరిజనులకు రహదారి సౌకర్యం ఏర్పడుతుందని ఆయన అన్నారు. స్పందించిన బూడి 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేసేందుకు అంచనా వ్యయం ఎంత అవుతుందో చెప్పాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పినకోట, పెద్దకోట పంచాయతీల గిరిజనులు పాల్గొన్నారు

పార్టీ ఆదేశిస్తే పోటీకి సిద్ధం

- బత్తిరి రవిప్రసాద్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పార్టీ ఆదేశిస్తే తాను అరకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధమని వైసిపి సీనియర్ నాయకులు, హుకుంపేట మండల మాజీ ఎంపీపీ బత్తిరి రవి ప్రసాద్ స్పష్టం చేశారు. పాడేరులో ఆదివారం రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రజా ప్రతినిధిగా ఎన్నికవడానికి సామర్థ్యం తనకున్నయన్నారు. 30 ఏళ్ల రాజకీయ అనుభవంతో పాటు ఆర్థిక, సామాజిక, సేవ అనుభవం ఉన్న తనను ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి పదవుల్లో పోటీ చేయాలని స్నేహితులు, మేధావులు, బంధువులు, అన్ని సామాజిక వర్గాల ప్రజలు కోరుతున్నారన్నారు. విద్య, రాజకీయం, సంక్షేమపై అవగాహన ఉన్న తాను ఏజెన్సీలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలకు సుపరిచితుడునని చెప్పారు. ప్రజాసేవలో ఉన్నానన్న సంగతి అందరికీ తెలిసిందేనని, అల్లూరి జిల్లా, అరకు నియోజకవర్గం, హుకుంపేట మండలానికి చెందిన తనకు అవకాశం ఇవ్వాలని వైసిపి అధిష్టానానికి కోరారు. చదువుకునే రోజుల్లో విద్యార్థి సంఘాల నాయకుడిగా, ఆ తర్వాత సర్పంచ్, ఎంపిటిసిగా, వైస్ ఎంపీపీగా అనుభవం ఉందన్నారు. అంతేకాకుండా అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో జిల్లా, మండల స్థాయి పార్టీ పదవుల్లో చేశానని గుర్తు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలన్నదే తన ఆశ, ఆశయమని చెప్పారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపుకు కృషి చేశానని తెలిపారు.

నేటి నుంచి పెన్షనర్ల నిరసనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమస్యలపై ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎన్ఎడి (మర్రిపాలెం) సమీపంలోని పిఎఫ్ కార్యాలయం వద్ద ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిరసనలు చేపట్టబోతున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్ తెలిపారు. నిరసనలో విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలు, సెంట్రల్ అండ్ స్టేట్ పెన్షనర్స్ పాల్గొని కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టాలన్నారు. కనీస పెన్షన్ రూ.9 వేలతో పాటు దానికి డిఎ అనుసంధానం చేయాలని, భార్యాభర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని, అందరికీ హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇవ్వాలని, రైల్వే రాయితీని పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలనే డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

మహిళల ఓట్లే కీలకం

గెలుపోటములపై ప్రభావం చూపనున్న అతివలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ప్రస్తుత ఎన్నికల్లో మహిళల ఓట్లే కీలకంగా మారనున్నాయి. అభ్యర్థుల గెలు పోటములను అతివల ఓట్లే నిర్ణయించనున్నాయి. పలుచోట్ల పురుషుల కంటే మహిళల ఓట్లు ఎక్కువగా ఉండటంతో వారి ఓట్లే ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఈ సారి ఎన్నికల్లో పెద్దదిక్కుగా మారనున్నాయి.

జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో పలు మండలాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఓట్ల వినియోగంలోనూ పురుషులే కంటే మహిళలే ముందుంటుంటారు. జిల్లాలోని పాడేరు ఐటిడిఎ పరిధిలో పాడేరు, అరకు నియోజకవర్గాలు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలో రంపచోడవరం నియోజకవర్గం ఉన్నాయి. వీటిలో పాడేరు నియోజకవర్గంలో 8,601, అరకులో 6,434, రంపచోడవరంలో 13,411 ఓట్లు పురుషుల కంటే మహిళల ఓట్లు అధికంగా ఉన్నాయి. మొత్తం జిల్లా వ్యాప్తంగా పురుషుల కంటే 28,446 మంది మహిళల ఓట్లు అధికంగా ఉన్నాయి.

భారీగా పెరిగిన ఓటర్లు..

మరో మూడు నెలల్లోపే సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. 2019 సాధారణ ఎన్నికల ఓటర్లతో పోల్చితే ఈసారి గణనీయంగా ఓటర్లు పెరగడం విశేషం. 2019లో అల్లూరి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 7,08,138 ఓటర్లు ఉంటే ఈ ఏడాదికి వచ్చేసరికి 7,61,255కి పెరిగారు. అంటే 53,117 ఓట్లు పెరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తుది జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో అతి తక్కువ నియోజకవర్గాలున్న అల్లూరి జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలో 7,61,255 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,66,386 మంది, 3,94,832 మంది మహిళలు, 37 మంది ఇతరులు ఉన్నారు. జిల్లాలో ముసాయిదా జాబితా నాటికి 7,40,573 మంది ఓటర్లుంటే తుది జాబితాకు వచ్చేసరికి 7,61,255 మందికి పెరిగారు. 40,076 మందికి కొత్తగా ఓటు హక్కు కల్పించారు. 19,394 మంది ఓటర్లను తొలగించారు. గతేడాది అక్టోబర్ 27 ప్రచురించిన ముసాయిదా జాబితాతో పోల్చితే అల్లూరి జిల్లాలో 20,682 మంది ఓటర్లు పెరిగారు. అందులో మహిళలే ఎక్కువగా ఉన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సంబరాలు

మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ప్రజాశక్తి-అరకు లోయ : మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని అరకు ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ అన్నారు. అరకు లోయలో ఆదివారం వైయస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ చేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన అన్నారు. మహిళలు ఆసరాను అందిపుచ్చుకుని ఆర్థిక పురోగతిని సాధించాలని ఎమ్మెల్యే కోరారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జడ్పీ చైర్పర్సన్ సుభద్ర మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, నాలుగన్నరేళ్లల్లో సీఎం మహిళా సంక్షేమం కోసం అందించిన అనేక సంక్షేమ పథకాలతో మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుపడేలా వ్యాపార దిగ్గజాలతో, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకొని వారికి వ్యాపార మార్గాలు చూపించడంతో పాటు ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలతో సుస్థిరమైన ఆర్థికాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం బాటలు వేశారని ఆమె అన్నారు. వైసీపీపార్టీ అరకు నియోజకవర్గ సమన్వయకర్త రేగమ్మత్య లింగం మాట్లాడుతూ, రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆసరా నిధుల మెగా చెక్కును మహిళలకు అందజేశారు. వీఓఏలు ప్రదర్శించిన ఆదివాసి గిరిజన సంప్రదాయ దింసా నత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

33 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో ఆదివారం స్థానిక పోలీసులు మూడు రోడ్ల జంక్షన్ కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 33 కిలోల లిక్విడ్ గంజాయిను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సీఐ రమేష్, ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... కూడలిలో జీపు, కారును ఆపి తనిఖీలు చేయగా సౌండ్ బాక్సులలో రహస్యంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కారు, జీపులో ఉన్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వీరిలో ఇద్దరు కేరళ రాష్ట్రానికి చెందిన వారు కాగా మరో ఇద్దరు అనకాపల్లి జిల్లా వడ్డాది గ్రామానికి చెందిన వారిగా గుర్తించారమన్నారు. వీరి వద్ద నుండి ఐదు మొబైల్ ఫోన్లను, రూ.12,500 నగదును స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

న్యాయంపూడిలో చోరీ

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని న్యాయంపూడిలో గ్రామానికి చెందిన గోరింట వరలక్ష్మికి చెందిన బంగారం, నగదు దొంగలు అపహరించారు. వరలక్ష్మి శనివారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటిలో బీరువాలో ఉన్న బట్టలు సామాగ్రి చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. దీంతో, అనుమానం వచ్చి పరిశీలించగా బంగారం, వెండి చోరీకి గురైంది. కిటికీలోంచి దొంగ చొరబడి అపహరించాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా సిఐ విజయ్ కుమార్ పరిశీలించారు. క్లూస్ టీం పరిశీలన చేశారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలో కోడి పందాలు ఆడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు స్థానిక ఎస్ఐ ఎ.విభీషణరావు తెలిపారు. ఆదివారం అడ్డురోడ్డు తిమ్మాపురంలో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేయగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బంగారం బిస్కెట్లు పట్టివేత

ప్రజాశక్తి- ఆనందపురం : బంగారం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధి భీమిలి క్రాస్ రోడ్ వద్ద ఉన్న చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నారు. వీరిని మహారాష్ట్రకు చెందిన దీపక్ విటల్ (24), అక్షయ్ అప్షో సవత్ (20)గా గుర్తించారు. వారి నుంచి 815 గ్రాముల బరువు కలిగిన 7 బంగారు బిస్కెట్లు, రూ.2 వేలు నగదు, ఒక బ్రాస్లెట్, 2 సెల్ ఫోన్లు స్వాధీనపరచుకున్నారు. వారిని ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తిరుపతిరావు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పార్వతీనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఆరిలోవ పార్వతీనగర్‌లో రెడ్డి తౌడు తన భార్య ముత్యాలమ్మ, కుమారుడు ప్రదీప్, కుమార్తె సౌమ్యలతో నివాసం ఉంటున్నారు. కుమారుడు ప్రదీప్ (17) మద్దిలపాలెం కృష్ణా కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో తల్లిదండ్రులు ఉండగానే ప్రదీప్ గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో కిందకు దించి విమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుని తల్లి ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

విజేతగా నిలిచిన చింతూరు జట్టు

'సకీనా' క్రికెట్ టోర్నీ విజేతగా చింతూరు

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు డివిజన్ కేంద్రంలో సకీనా బ్రదర్స్ అధ్వర్యంలో వారి తండ్రి మొహ్మద్ మున్షీ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా చింతూరు జట్టు నిలిచింది. చింతూరు క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోటీల్లో 80 జట్లు పాల్గొనగా ఫైనల్స్ కు చింతూరు ఎవైఎ, చోప్పల్లి జట్లు చేరుకున్నాయి. ఫైనల్స్‌లో టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసిన చింతూరు ఎవైఎ జట్లు నిర్ణీత 15 ఓవర్లకు 85 పరుగులు చేశారు. బ్యాటింగ్‌లో దిలీప్ యాదవ్ 16 పరుగులు, సోడి నరేష్ 15పరుగులతో రాణించారు. చోప్పల్లి జట్లు బౌలర్ బోగ్గ సాగర్ 4వికెట్లు తీశాడు. . అనంతరం 86పరుగుల లక్ష్య చేధనలో బ్యాటింగ్ చేపట్టిన చోప్పల్లి జట్టు 9.5 ఓవర్లకు 55 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. చింతూరు ఎవై బౌలర్ డీపీ 3 వికెట్లు, నరేష్ 3 వికెట్లు తమ జట్టు గెలుపులో కీలకభూమిక పోషించారు. ఫైనల్ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రాణించి, ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన నరేష్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది టోర్నీగా చింతూరు జట్టు ఆటగాడు డిపి కైవసం చేసుకున్నాడు. టోర్నీలో బెస్ట్ బ్యాట్స్ మ్యాన్‌గా చోప్పల్లి బ్యాటర్ గౌతమ్, టోర్నీ బెస్ట్ బౌలర్‌గా పవన్ చోప్పల్లి, బెస్ట్ క్యాచ్‌ను చింతూరు ఎవైఎ టీమ్ సభ్యుడు సురేష్(బోగుల్), బెస్ట్ టీమ్‌గా చింతూరు ఎవైఎ, బెస్ట్ కెప్టెన్‌గా చింతూరు ఎవైఎ కెప్టెన్ గొంది దుర్గ అవార్డులనుఅందుకున్నారు.

టోర్నీ విజేత చింతూరు ఎవైఎ జట్టుకు విన్నర్ ట్రోఫీ తో పాటు రూ.50 వేల నగదును, రన్నరప్ చోప్పల్లి జట్టుకు రన్నర్ ట్రోఫీ రూ.25వేల నగదును, మూడవ స్థానంలో నిలిచిన కుటూరు జట్టుకు రూ.10వేల నగదు, నాల్గోవ స్థానంలో రామవరం జట్లు రూ.5వేల నగదును, 5,6వ స్థానం లో నిలిచిన వేగితోట, చింతూరు బ్లూస్టార్ జట్లు సభ్యులు టీ షర్ట్స్‌ను గెలుపొందారు. విజేతలకు చింతూరు సిఐ గంజెంద్ర కుమార్, సిఐ వెంకటరత్నం ,చింతూరు వైస్ ఎంపిపి మేడేపల్లి సుధాకర్, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్, ఎల్ఐ గణేష్, క్రికెట్ కోచ్ సుబ్రమణ్యం, ఎండి జిక్రియా, వీసీ రాము, సకీనా బ్రదర్స్ యూసఫ్, సౌకత్, అయూబ్, అక్బర్, అన్వర్, హాసన్, టోర్నీ నిర్వాహక కమిటీ సభ్యులు ప్రదీప్, దశరథ్, శేఖర్ , రియాజ్, రాజేష్ , సూరి, హరి, మిగతా సభ్యులు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని రంపచోడవరం ఎస్ఐ మోహన్ కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే, జరిమానాతో పాటు కఠినంగా శిక్షిస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు అన్ని వాహన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు.

అయ్యన్న అలక..!

చంద్రబాబు తీరుపై అసంతృప్తి
రా కదలిరా ఏర్పాట్లకు దూరం
అదే దారిలో అనిత
నేడు గొండుపాలెంలో సభకు టిడిపి అధినేత రాక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కె.కోటపాడు విలేకరి

అయ్యన్నపాత్రుడు

టిడిపి సీనియర్ నాయకుడు, ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మధ్య దూరం పెరుగుతున్నట్లు కనబడుతోంది. వచ్చే ఎన్నికల్లో సీట్లు కేటాయింపు విషయమై అయ్యన్న సూచనలను చంద్రబాబు పరిగణనలోకి తీసుకోకపోవడంతో మనస్తాపానికి గురైన అయ్యన్న సోమవారం కోటపాడు మండలంలో జరగనున్న రా కదలిరా కార్యక్రమ ఏర్పాట్లకు దూరంగా వున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రా..కదలిరా కార్యక్రమం ఏర్పాట్లను అయ్యన్న, ఆయన తనయుడు విజయ్ చూడ్డానికి వెళ్లకపోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. నిన్న మొన్నటి వరకూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పార్టీ కార్యక్రమాలను దగ్గరుండి విజయవంతం చేసిన అయ్యన్న ఈసారి రా కదలిరా ఏర్పాట్లు పరిశీలనకు వెళ్లకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చకు దారితీసింది. వ్యక్తిగత పనుల కారణంగా బయటకు వెళ్లడంతో ఆయన రాలేకపోయినట్లు పార్టీ నాయకులు చెబుతున్నా కేడర్ నమ్మడం లేదు. అనకాపల్లి ఎంపీ టిక్కెట్, నర్సీపట్నం ఎమ్మెల్యే టిక్కెట్‌పై అయ్యన్న చేసిన ప్రతిపాదనలను చంద్రబాబు తిరస్కరించడంతో ఇద్దరి మధ్య జరిగిన చర్చల్లో కొంతసేపు వాదోపవాదాలు జరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అనకాపల్లి ఎంపీ టిక్కెట్ తన తనయుడు విజయ్‌కు కేటాయించాలని అయ్యన్న కోరగా బైరా ఫౌండేషన్ ఛైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తికి ఎంపీ టిక్కెట్ ఇవ్వనున్నట్లు చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది.

తన తనయుడు విజయ్‌కు ఇవ్వకపోయినా.. జిల్లాలో పార్టీ జెండాను మోసిన ఎవరికిచ్చినా పరవాలేదని అయ్యన్న అన్నట్లు తెలిసింది. పార్టీతో సంబంధంలేని దిలీప్ చక్రవర్తికి టిక్కెట్ ఇవ్వాలనుకోవడం సరికాదంటూ అయ్యన్న విబేధించినా, ఈ విషయంలో మార్పులేదని చంద్రబాబు అన్నట్లు తెలిసింది. అనకాపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వకపోయినా, నర్సీపట్నం ఎమ్మెల్యే టిక్కెట్ తనకు బదులు విజయ్‌కు ఇవ్వాలని చెప్పినా అందుకు అంగీకరించని చంద్రబాబు... ఈ ఎన్నికల్లో మీరే పోటీ చేయాలని చెప్పడంతో కలతచెందిన అయ్యన్న వెనుదిరిగి వచ్చినట్లు తెలిసింది. దిలీప్ చక్రవర్తికి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలనుకోవడం, నర్సీపట్నం టిక్కెట్ విజయ్‌కు ఇవ్వనని చెప్పడం అయ్యన్నను మనస్తాపానికి గురిజేసింది. జిల్లాలో లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఖర్చులు దిలీప్ చక్రవర్తి పెట్టినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. పార్టీ కార్యక్రమాలకు పెట్టుబడి పెడుతున్న చక్రవర్తికి అనకాపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలన్న ఆలోచనకు చంద్రబాబు పాదయాత్రకు ముందే వచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఎంపీ టిక్కెట్ దిలీప్ చక్రవర్తికి ఇవ్వాలన్న చంద్రబాబు నిర్ణయంపై అయ్యన్న అభ్యంతరం చెబుతూ వస్తున్నారు. యువగళం పాదయాత్రలో దిలీప్ చక్రవర్తి ఫ్లెక్సీలపై అప్పట్లోనే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విషయం లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. చంద్రబాబు వైఖరిలో మార్పులేకపోవడంతో వి.మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం గొండుపాలెంలో 'రా కదలిరా' బహిరంగ సభ వేదిక ఏర్పాట్లకు అయ్యన్న దూరంగా వున్నారు. జిల్లాకు చెందిన మరో పొలిట్ బ్యూరో సభ్యులు అనిత కూడా చంద్రబాబు నిర్ణయాలపై అసంతృప్తితో వున్నట్లు తెలిసింది. అందుకనే అయ్యన్న దారిలో అనిత కూడా పయనిస్తూ.. రా కదలిరా కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలనకు వెళ్లలేదని తెలిసింది. ఈ పరిణామాలు ఆ పార్టీలో పెరుగుతున్న అంతర్గత సమస్యలకు అద్దంపడుతున్నాయి.

ఊరించి.. ఉసూరుమనిపించి..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 105 - ఎస్‌జిటి కేవలం 8 పోస్టులే - నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా కేవలం 105 పోస్టులను మాత్రమే ప్రభుత్వం భర్తీ చేయనుంది. అతి తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనుండడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో అన్ని పోస్టులు కలిపి 105 ఖాళీలు వున్నట్లు విద్యాశాఖ తేల్చింది. ఆ లెక్కల ప్రకారం.. కొన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఖాళీ పోస్టులే లేవు. జెడ్‌పిపి, ఎంపిపి యాజమాన్యం పాఠశాలల్లో తెలుగు, ఫిజికల్ సైన్సు, సోషల్, ఎస్‌జిటి ఖాళీలు లేవు. ప్రభుత్వ యాజమాన్యంలో తెలుగు, లెక్కలు, బయోలాజికల్ సైన్సు, సోషల్ సబ్జెక్టు టీచర్ల ఖాళీలు చూపలేదు. జివిఎంసి, మున్సిపాల్టీల్లో లెక్కలు, ఎస్‌జిటి పోస్టులు లేవు. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

యాజమాన్యాల వారీగా ఖాళీగా వున్న పోస్టులు

యాజమాన్యం	తెలుగు	హిందీ	ఇంగ్లీష్	లెక్కలు	పిఎస్	బిఎస్	సోషల్	పిఇటి	ఎస్‌జిటి	మొత్తం
జెడ్‌పిపి, ఎంపిపి	-	23	3	4	-	5	-	28	-	63
ప్రభుత్వ	-	1	3	-	4	-	-	9	8	25
జివిఎంసి, మున్సిపల్	7	3	3	1	-	1	1	1	-	17
మొత్తం	7	27	9	5	4	6	1	38	8	105

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

'బాబు ష్యూరిటీ'పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కూడా వెంకట సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రెండో రోజున బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అరుకు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి నక్క హరిహర తిరుమలరావు మాట్లాడుతూ, సీలేరులో బాబు ష్యూరిటీ ప్రచారానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. వైసిపి అరాచక పాలనలో విసిగిపోయిన ప్రజలు, వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్‌ను, వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతికుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్‌సిలెండర్లు, ప్రతిమహిళకు నెలకు రూ.1500 ఆర్థికసాయం, నిరుద్యోగ యువతనకు జీవనభృతి, మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్‌ప్రయాణం, మహాశక్తి పథకాలను అమలు చేస్తామన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు కె. సన్యాసిరావు సిహెచ్. రాము, బొర్రా కృష్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలం భూపతిపాలెం రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మహిళా మృతదేహం కలకలం రేపింది. ఆదివారం ఉదయం భూపతిపాలెం రిజర్వాయర్ నీటిలో గుర్తుతెలియని మహిళా మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ విజయ్ కుమార్, తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు అయితే మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బందపల్లిలో 'పరివర్తన'

ప్రజాశక్తి -రంపచోడవరం : ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి పర్యవేక్షణలో రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐలు ఎం.మోహన్‌కుమార్, సత్యసాయి ఆధ్వర్యంలో ఆదివారం బందపల్లి గ్రామంలో పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాబోవు ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ఎలా మసలుకోవాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, స్థానికులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎస్‌పై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎస్ సమస్యను తక్షణం పరిష్కరించాలని, లేకుంటే పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వారు నిరసన దీక్ష చేపట్టారు.

రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు వెన్నుపోటు పొడిచిన రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులందరికీ అవిశ్వాస పాత్రునిగా సిఎం జగన్ చరిత్రలో నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల మరిదాస్, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు గూమారు శ్రీనివాస్, బండారు దేవుడుబాబు పాల్గొన్నారు.